క్లుప్తంగా

అక్రమ నిర్మాణం కూల్చివేత



ట్రాక్టర్‌తో కూల్చివేయిస్తున్న సిబ్బంది

మందమర్రిరూరల్: పట్టణంలోని మొదటి జోన్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కొనసాగుతుండగా నాలుగు రోజుల క్రితం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. సిబ్బంది ఆదేశాలు భేఖాతరు చేస్తూ, మళ్లీ అక్రమ నిర్మాణాన్ని కొనసాగించగా ఆదివారం తహసీల్దార్ చంద్రశేఖర్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాన్ని బ్లేడ్ ట్రాక్టర్‌తో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ నిర్మల్ ఇన్‌చార్జిగా మల్లారెడ్డి



మంచిర్యాలటౌన్: భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మంచిర్యాల మాజీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల మల్లారెడ్డిని నియమిస్తూ ఆది వారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మల్లారెడ్డి పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి పలు మార్లు అనేక బాధ్యతలు ఇవ్వగా, సమర్థవంతంగా నిర్వర్తించడం వల్లనే తనకు ఈ అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా పూర్తిస్థాయిలో పనిచేస్తానని అన్నారు.

బీసీ రాజ్యాధికార దీక్ష దివస్

పాతమంచిర్యాల: బీసీ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో దీక్షదివస్ ఒక్క రోజు నిరాహార దీక్ష చేస్తున్నామని బీసీ రాజ్యాధికార సాధన సమితి నాయకులు చంద్రమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, రాజకీయపార్టీల నాయకులు, యువకులు విద్యావేత్తలు పాల్గొని సంఘీభావం తెలుపాలన్నారు.

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్‌గా సునీల్‌కుమార్



జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ ఉత్తమ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ అవార్డు అందుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి బీవీ పట్టాభిరామ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

భూమాచారి దీక్షకు పెరుగుతున్న మద్దతు



దీక్షలో పాల్గొన్న స్థానికులు

జన్నారం: జన్నారంకు 132కేవీ సబ్‌స్టేషన్ నిర్మించాలనే డిమాండ్‌తో 12రోజులుగా సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరహార దీక్షలకు ఆదివారం పలువురు మద్దతు తెలిపారు. పొనకల్‌కు చెందిన ఆయన స్నేహితులు, రజక సంఘ నాయకులు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో కొత్త వేణుగోపాల్, రజక సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు నరేశ్, భీమయ్య, సురేశ్, సత్యం, శ్రీనివాస్, అశోక్, గంగ, పోసవ్వ, గీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'మా ఊరు సేవా సంఘం' సంస్థకు సహకరిస్తాం

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రికి చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇబ్రహీం సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన 'మా ఊరు సేవా సంఘం' స్వచ్ఛంద సంస్థకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. ఊరు మందమర్రిలోని ఇబ్రహీం ఇంటి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సంస్థ కార్యకలాపాలను ప్రారంభించారు. గ్రామంలోని పది కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ఇబ్రహీం, పీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రిటైర్డ్ ఏఈవో జగన్, సంస్థ అధ్యక్షుడు పెద్ది రాన్న, శ్రీమన్నారనాయణ, కలవేన శ్యాం, దశరథం తదితరులు ఉన్నారు.

సాగునీటి కాలువలు అధ్వానం..!

- పేరుకుపోతున్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న రైతులు



37సబ్ డిస్ట్రిబ్యూటరీ 5వ కాలువలో తుంగ



గంపలపల్లి గ్రామంలోని డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్త, పిచ్చిమొక్కలు

లక్సెట్టిపేట: పంట కాలువల మరమ్మతులపై ఇరిగేషన్ అధికారుల పట్టింపు కరువైంది. పంటలకు నీరందించే కాలువల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరగడంతో నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. మండలం మొత్తంగా 16500ఎకరాల వరిధాన్యం పంటను రైతులు సాగు చేస్తుండగా, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా, అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు. కడెం ప్రాజెక్టులోకి నీరు చేరడంతో కడెం ఆయకట్టు కింద పొలాలకు నీటిని విడుదల చేశారు. మొత్తం 37డిస్ట్రిబ్యూటరీ నుంచి 41వరకు మండలంలోని వరి పొలాలకు నీటిని సరఫరా చేసేందుకు కాలువలు ఉన్నాయి. అందులో ఒక్క కాలువను కూడా మరమ్మతు చేపట్టకపోవడంతో కాలువల్లో చెత్త, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. సైడ్‌వాల్స్ సరిగా లేకపోవడంతో కొన్ని ప్రదేశాల్లో నీరు వృథాగా పోతోంది. మెయిన్ కాలువ నుంచి చివరివరకూ ఇదే పరిస్థితి నెలకొంది. సబ్ డిస్ట్రిబ్యూటరీ కాలువ 5వ నంబర్‌లో తుంగ ఏపుగా పెరిగి, మురుగునీరు కాలువలోకి చేరుతోంది. ఇరిగేషన్ అధికారులు కనీసం వారంలో ఒక్క రోజు కూడా కాలువ ప్రదేశాలను పరిశీలించడం లేదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇంటిలో నుంచి వెలువడే డ్రెయినేజీ నీరు, నాళాల మురుగు నీరు పంట కాలువల్లో కలుస్తున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట సాగుకు వచ్చే నీరు మురికిగా ఉండడంతో పంటలకు చీడలు ప్రబలే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని, పంట కాలువల మరమ్మతుపై దృష్టి పెట్టి పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పంట కాలువల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో ఎన్నార్జీఎస్ ద్వారా పనులు చేపించేందుకు ఎంపీడీవోకు సమాచారం ఇచ్చాం. కొన్ని ప్రదేశాల్లో మరమ్మతు కోసం నిధులు మంజూరయ్యాయి. వాటిని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొద్దిగా వర్షాలు తగితే పనులు ప్రారంభిస్తాం.

– దశరథ్, ఇరిగేషన్ డీఈ, లక్సెట్టిపేట

వైభవంగా మహంకాళి బోనాలు



బోనాలతో భక్తులు

చెన్నూర్: పట్టణంలోని గోదావరి రోడ్డులో గల మహంకాళి అమ్మ ఆలయంలో బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బోనాలలో నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, కౌన్సిలర్ వేల్పుల సుధాకర్ పాల్గొన్నారు.

'గట్టు మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ'



గట్టుపై బారులు తీరిన భక్తులు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ గట్టు మల్లన్న సన్నిధిలో ఆదివారం శ్రావణమాసం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రీ మల్లన్న స్వామిని ప్రత్యేకంగా దర్శించుకుని పట్నాలు వేసి, భోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో అటవీ ప్రాంతం అంతా సందడి వాతావరణం నెలకొంది. శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు కుటుంబసమేతంగా మలన్న స్వామిని దర్శించకోగా స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కింద ఆలయం వద్ద, గట్టుపై సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

ఎన్నికల ప్రచారం అడ్డుకుంటాం



మాట్లాడుతున్న 24వ వార్డు ప్రజలు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే నాయకులను అడ్డుకుంటామని ఆ వార్డు ప్రజలు తీర్మానం చేశారు. వార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమస్యలపై చర్చించారు. వార్డులో డ్రెయినేజీ, వీధి లైట్స్ సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వ విప్ సుమన్ ఎన్నికల సమయంలో వచ్చాడని, మళ్లీ ఒక్కసారి కూడా రాలేదని ఆరోపించారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తులు



దరఖాస్తు చేస్తున్న తులా మధుసూదన్



దరఖాస్తు చేస్తున్న తులా ఆంజనేయులు



చెన్నూర్: దరఖాస్తు చేసుకుంటున్న రాంభావు

చెన్నూర్: నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం చెన్నూర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, ప్రస్తుత ఏజీపీ ఆకుదారి రాంభావు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నేతకానీ సామాజిక వర్గానికి చెందిన రాంభావు అధిష్టానం టికెట్ ఇస్తే చెన్నూర్‌లో బీజేపీ జెండాను ఎగురవేస్తానన్నారు.

బీజేపీ మంచిర్యాల అభ్యర్థులుగా...

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆదివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్ రావు బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్‌తో కలిసి దరఖాస్తు చేశారు. బీసీ వర్గానికి చెందిన తనకు బీజేపీ అధిష్టానం టికెట్ ఇస్తుందనే నమ్మకం ఉందన్నారు. బీసీ అభ్యర్థిగా తులా ఆంజనేయులు సైతం దరఖాస్తు చేసుకోగా, విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున పోరాటం చేసిన తనకు టికెట్ వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

'జనక్‌ప్రసాద్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి'



మాట్లాడుతున్న కాంపెల్లి సమ్మయ్య

నస్పూర్/మందమర్రిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున రామగుండం ఎమ్మెల్యే టికెట్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు కేటాయించాలని ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి కొన్ని సీట్లు కేటాయిస్తామని ఏఐసీసీ ప్లీనరీలో చేసిన తీర్మాణం మేరకు రామగుండం ఎమ్మెల్యే టికెట్‌ను జనక్‌ప్రసాద్‌కు ఇవ్వాలని కోరారు. నస్పూర్ జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ బ్రాంచి సెక్రటరీలు సీహెచ్ బీంరావు, గరిగె స్వామి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పెట్టం శ్రీనివాస్, సమ్ము రాజయ్య, నాయకులు పాల్గొన్నారు. మందమర్రిలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, చంద్రశేఖర్, ఓదెలు, వేణు, వెంకటస్వామి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.'

దీక్షకు సంఘీభావం



మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. దీక్షల శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

నియమాలు పాటించాలి

బెల్లంపల్లి: వినాయక మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు విధిగా పాటించాలని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య కోరారు. వినాయక మండపాల నిర్వాహకులతో ఆదివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధించిన పత్రం వన్‌టౌన్‌లో అందజేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం కోసం డిస్కం అధికారుల నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. నిమజ్జనం రోజున డిజే సౌండ్‌ను వినియోగించవద్దని, నిబంధనలకు వ్యతిరేకంగా మండపాల నిర్వాహకులు పాల్పడవద్దన్నారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



రామునిచెరువు వాకర్స్ ఆధ్వర్యంలో నివాళులు



జన్నారంలో...



మందమర్రిలో...



చెన్నూర్‌లో..

ఘనంగా ఐలమ్మ వర్ధంతి

తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కనబర్చిన ధైర్యసాహసాలను కొనియాడారు. ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని రజక సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. వర్ధంతిని పురస్కరించుకుని దండేపల్లిలో మండల ఇస్త్రీ సంఘం అధ్యక్షుడు మందపెల్లి వెంకటేష్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– మంచిర్యాలటౌన్/జన్నారం/రామకృష్ణాపూర్/చెన్నూర్/మందమర్రిరూరల్/దండేపల్లి/నస్పూర్/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/జైపూర్



దండేపల్లిలో...



నస్పూర్‌లో...



జైపూర్: మిట్టపల్లిలో...



చెన్నూర్‌రూరల్: మాట్లాడుతున్న సంకె రవి



రామకృష్ణాపూర్‌లో...



లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా విశ్వనాథశాస్త్రి జయంతి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో సంగీత సాహిత్య సుధావాహిని ఆధ్వర్యంలో ఆదివారం విశ్వనాథశాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ సత్య నారాయణశాస్త్రీ సాహిత్యంపై శతావధాని ఎంవీ పట్వర్ధన్ ప్రసంగం చేశారు. విశ్వనాథ సాహిత్యం నాది పాషాణ భాషకాదు వ్యవహారభాష మందర శైలి, స్తోత్రాలను ఉద్దేశించి రసధ్వని ప్రధానంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు శ్రీనాథ్‌గౌడ్, భాగ్యలక్ష్మి, అల్లాడి శ్రీనివాస్, వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

పాతమంచిర్యాల: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన సమ్మె 10వ రోజు కొనసాగింది. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక సాయం

బెల్లంపల్లి: అనారోగ్యంతో అకాల మృతి చెందిన ఓ స్నేహితుడి కుటుంబానికి ఆదివారం చిన్ననాటి మిత్రులు ఉదారస్వభావంతో ఆర్థికసాయం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ శాంతిఖని బస్తీకి చెందిన మీనుగు అవినాష్ అనే ఆటో డ్రైవర్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. మిత్రుడి కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు గ్రహించిన అదే బస్తీకి చెందిన సహచర చిన్ననాటి మిత్రులు తోచిన రీతిలో ఆర్థికసాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు రూ.13,500వసూల్ చేసి ఆ మొత్తాన్నీ మృతుడి భార్య మీనుగు వాణి, కొడుకు రాహుల్‌కు నగదు రూపంలో అందజేశారు.

నృత్య కళలో చిన్నారులు రాణించాలి

మందమర్రిరూరల్: నృత్య కళలో పరిపూర్ణులై చిన్నారులు రాణించాలని బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన గజ(మువ్వల) పూజ కార్యక్రమానికి హాజరై రెండు నెలలు నృత్య శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు మువ్వలు అందించారు.

కమిటీ ఎన్నిక

నస్పూర్: పట్టణ పరిధిలోని వెల్డింగ్ షాపుల యజమానులు పట్టణ వెల్డింగ్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..!

- కాలనీల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- వర్షాలకు కుళ్లిపోయి వెదజల్లుతున్న దుర్వాసన
- వృద్ధిచెందుతున్న దోమలు, ఈగలు
- రోగాల బారిన పడుతున్న జనం



పట్టణంలోని శివాలయం వెళ్లే దారిలో మూలమలుపు వద్ద చెత్తకుప్ప

చెన్నూర్: మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా వర్షం కురుస్తుండడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది జనం రోగాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

మున్సిపాలిటీ పరిస్థితి ఇలా..

చెన్నూర్ మున్సిపాలిటీలో 18వార్డుల్లో 25,357 మంది జనాభా ఉంది. చెత్తను తొలగించేందుకు ప్రణాళికబద్ధంగా వార్డుల వారిగా కార్మికులను కేటాయించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో సీజనల్ వ్యాధులు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైరల్ ఫీవర్ల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత నెలలో..

మున్సిపాలిటీలలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జులై 31నుంచి ఆగష్టు 9వరకు ప్రత్యేక పారిశధ్య పనులు చేపట్టారు. ఆగష్టు 10నుంచి నేటి వరకు అధికారులు కాలనీల్లో పర్యటించిన పాపన పోలేదు. వారానికి రెండు, మూడు రోజులకు ఒక్కసారి చెత్త వాహనాలు వస్తున్నప్పటికీ, ఇళ్లలోని చెత్త తీసుకువెళ్తున్నారు తప్పా.. చెత్త కుప్పలను తొలగించకపోవడంతో అధ్వానంగా తయారవుతోంది. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజలు కోరుతున్నారు.

చెత్త తొలగిస్తాం

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక ఫోకస్ పెడుతాం. మున్సిపాలిటీకి కొత్తగా పది మంది వార్డు ఆఫీసర్లు వచ్చారు. ప్రత్యేకంగా కాలనీని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఎప్పటికప్పుడు డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం. ప్రస్తుతం 9చెత్త వాహనాలను నడిపిస్తున్నాం. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త వాహనాల్లో వేయాలి. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్

'మా పోరాటాల ఫలితమే ఏరియర్స్ చెల్లింపు'

నస్పూర్: తమ యూనియన్ పోరాటాల ఫలితంగానే సింగరేణి ఉద్యోగులకు రావాల్సిన 11వ వేజ్ బోర్డు 23నెలల ఏరియర్స్‌ని ఈ నెల 21న ఒకే దఫాలో చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.